క్లుప్తంగా

నివాళులు



దిల్కత్ బేగం మృతదేహానికి నివాళులర్పిస్తున్న రవిబాబు

ఒంగోలు టౌన్: రోడ్డు ప్రమాదంలో మరణించిన ఇస్లాంపేటకు చెందిన షేక్ అబూబకర్ సతీమణి దిల్కత్ బేగం మృతదేహానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. పిల్లలకు పుస్తకాలు కొనుక్కునేందుకు వెళ్లి ఊహించని విధంగా అకాల మరణం చెందడం బాధకరమన్నారు. చుండూరి రవిబాబుతోపాటుగా పార్టీ నాయకులు వెంట ఉన్నారు.

పారిశ్రామికవేత్తలకు అవగాహన



మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసరావు

చీమకుర్తి: నూతనంగా పరిశ్రమలను ఏర్పాటు చేసే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఉద్యమ సర్టిఫికెట్‌లు ప్రభుత్వం నుంచి రాయితీలను పొందటంలో తోడ్పడతాయని జిల్లా పరిశ్రమల శాఖ జీఎం బీ.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం చీమకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఎంఎస్ఎంఈ ర్యాంప్ కార్యక్రమంలో భాగంగా పారిశ్రామిక రంగంలో అడుగు పెట్టాలనుకునే వారికి ఉద్యమ రిజిస్ట్రేషన్‌లపై అవగాహన కల్పించారు. రాష్ట్రంలోని ప్రభుత్వం వన్ ఫ్యామిలీ–వన్ ఎంటర్‌ప్రెన్యూర్ కార్యక్రమంలో భాగంగా ఇంటికొక పారిశ్రామికవేత్తను తయారు చేయాలని సంకల్పంగా పెట్టుకుందని వివరించారు. దానికిగాను పరిశ్రమలను ఏర్పాటు చేయాలనుకునే వారికి తప్పనిసరిగా ఉద్యమ సర్టిఫికెట్‌లను పొందాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్‌లు ధనలక్ష్మి, థామ్సన్, డిక్కీ ప్రతినిధి పీ.హరిప్రసాద్, సూపరింటెండెంట్ వజ్జా శ్రీనివాసరావు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్ యుద్ధోన్మాదం విడనాడాలి



ఒంగోలు టౌన్: ప్రపంచ శాంతి కోసం యావత్ ప్రజలు ఇజ్రాయెల్ యుద్ధోన్మాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న క్రూరమైన దాడులకు నిరసనగా, పాలస్తీనాకు సంఘీభావంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి చర్చి సెంటర్, మిర్యాల పాలెం, పాత కూరగాయల మార్కెట్, అద్దంకి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం సీపీఐ ఎంఎల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గాజాపై దాడుల్లో వేలాదిమంది చిన్నారులు చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ.. గాజాను 24 గంటల్లో ఖాళీ చేయమని ఇజ్రాయిల్ హుకుం జారీ చేయడం దుర్మార్గం అన్నారు. కార్యక్రమంలో ఆర్. వెంకటరావు, సాయి, కాలం సుబ్బారావు, బాలకోటయ్య, ఉబ్బా ఆదిలక్ష్మి, రమాదేవి, పద్మ, సాగర్, ఎంఏ సాలార్ తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ ఆస్తులు అప్‌డేట్ చేయాలి

ఒంగోలు సబర్బన్: దేవదాయ శాఖకు చెందిన ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు వాటి వివరాలను వెబ్ ల్యాండ్‌లో అప్డేట్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ఒంగోలు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధ్యక్షతన ఎండోమెంట్ ఆస్తుల పరిరక్షణకు సంబంధించి జిల్లా స్థాయి ఇంటర్ డిపార్ట్‌మెంటల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ దేవదాయ శాఖకు సంబంధించిన ఆస్తుల పరిరక్షణకు, డేటాను రెవెన్యూ వెబ్ ల్యాండ్‌లో అప్‌డేట్ చేయటానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. దేవదాయ శాఖ అధికారులు అజెండాలో పొందుపరచిన వివిధ దేవాలయాల ఆస్తులను సంబంధిత తహసీల్దార్లు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలన చేసి తహసీల్దార్ పరిధిలో అవకాశం ఉంటే మ్యుటేషన్ లేదా పేరు మార్పు చేసి వెబ్ ల్యాండ్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ పరిధిలో లేకపోతే సమగ్ర సమాచారంతో ప్రతిపాదనలను పై అధికారులకు పంపాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ రెవెన్యూ, దేవదాయ శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు, కనిగిరి ఆర్డీఓలు లక్ష్మీ ప్రసన్న, కేశవర్ధన్ రెడ్డి, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పానకాల రావు, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

శిథిల చప్టాలు.. ప్రజల వెతలు!



మంచికలపాడు-బండ్లమూడి మధ్య ముదిగొండు వాగుపై శిథిల వంతెన



గాడిపర్తివారిపాలెం-ఇలపావులూరు మధ్యగల వంతెనపై రెండువైపుల రక్షణ గోడలు లేని దుస్థితి

- మండలంలో కూలే దశలో చప్టాలు
- మంచికలపాడు–బండ్లమూడి మధ్య ప్రమాదకరంగా ఉన్న దుస్థితి
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు

చీమకుర్తి రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు. పాలన మొత్తం మాటల్లోనే కనిపిస్తోంది తప్ప చేతల్లో కనిపించడం లేదని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. గ్రామాల మధ్య ప్రయాణం చేయాలంటే భయపడే పరిస్థితులు ఉన్నాయి. చీమకుర్తి మండలంలో కాలం చెల్లిన చప్టాలు ప్రజలను కలవరపెడుతున్నాయి. పలు గ్రామాల మధ్య చప్టాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మంచికలపాడు-బండ్లమూడి మధ్య ముదిగొండు వాగుపై చప్టా, బండ్లమూడి పల్లామల్లి మధ్య రెండు చప్టాలు, గాడిపర్తివారిపాలెం ఇలపావులూరు మధ్యగల చప్టాలు కూలేదశలో ఉన్నాయి. మంచికలపాడు-బండ్లమూడి మధ్య ముదిగొండు వాగుపై వంతెన నిర్మించి దాదాపుగా 40 ఏళ్లకు పైనే అవుతోంది. వంతెనపై రెండు వైపుల రక్షణ గోడలు లేకపోవడం వలన ముదిగొండి వాగులో వాహనదారులు పడిన సందర్భాలు ఉన్నాయి. అదేవిధంగా గాడిపర్తివారిపాలెం-ఇలపావులూరు మధ్యగల చప్టా కూడా రెండు వైపుల రక్షణ గోడ లేకపోవడంతో రాత్రి పూట ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, కూటమి ప్రజాప్రతినిధులు మేల్కొని శిథిలావస్థలో ఉన్న చప్టాలను బాగు చేసి ప్రమాదాలను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.



చీమలమర్రి-మంచికలపాడు ఎన్ఎస్పీ కాలువ మీద శిథిలావస్థకు చేరిన చప్టా



ఒంగోలు-కర్నూలు ప్రధాన రహదారి చీమలమర్రి వద్ద రెయిలింగ్ లేని కల్వర్టు



ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
గడచిన ఏడాది కాలంలో ప్రభుత్వం రోడ్ల మీద దృష్టిసారించ లేదు. గాడిపర్తివారిపాలెం ఇలపావులూరు మధ్యగల చప్టాలు కూలేదశలో ఉన్నాయి. వాటిని యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలి. శిథిలావస్థలో ఉన్నవాటి స్థానంలో కొత్తవి నిర్మించాలి.
– పులి కోటేశ్వరరావు, ఇలపావులూరు



వాహనాలు వాగులో పడుతున్నాయి..
బండ్లమూడి–మంచికలపాడు మధ్య చప్టాకు రెండు వైపులా రక్షణ గోడలు లేవు. ఆ ప్రాంతంలో మలుపు ఉండటం వలన రాత్రివేళలో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. చాలాసార్లు వాగులో పడిన సందర్భాలు ఉన్నాయి. కావున అధికారులు, ప్రభుత్వం కొత్త చప్టాలు నిర్మించాలి.
– పొన్నపల్లి నాగేశ్వరరావు, మంచికలపాడు

పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెంపు



సర్పంచ్ చేతుల మీదుగా పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్న ఏజీ స్వర్ణలత



బూదవాడలో మాట్లాడుతున్న ఏవో భాస్కర్

మద్దిపాడు: రైతులు తమ పొలాలకు పచ్చిరొట్ట ఎరువును అందిస్తే భూములు సారవంతంగా మారుతాయని మండల వ్యవసాయశాఖ అధికారిణి స్వర్ణలత అన్నారు. మంగళవారం మండలంలోని రాచవారిపాలెం కీర్తిపాడు, నాగన్నపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు తమ పొలాలలో ఎంతమేర సారవంతంగా ఉన్నాయో తెలుసుకోవడానికి భూసార పరీక్ష కార్డులు ఉపయోగపడతాయన్నారు. అంతే కాకుండా తమ భూములు సారవంతం చేసుకోవడానికి పచ్చిరొట్ట ఎరువులు ఉపయోగపడతాయని ఆమె తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి చేకూరుతుందన్నారు. అదే విధంగా రైతులు ఈ–కేవైసీ చేయించాల్సిన అవసరం లేదని పాతవే అప్‌డేట్ అయ్యాయని తెలిపారు.

అందుబాటులో పశువుల దాణా..

వ్యవసాయ శాఖ అనుబంధ విభాగమైన పశు సంవర్ధక శాఖ అధికారిణి డాక్టర్ హిరణ్మయిశ్రీ మాట్లాడుతూ గ్రామాల్లో పశువుల దాణాను అందుబాటులో ఉంచామన్నారు. అవసరమైన సమయాల్లో వ్యాక్సిన్‌లు చేయించుకోవాలని తెలిపారు. ఉద్యాన శాఖ అధికారిణి సంధ్య మాట్లాడుతూ రైతులు ఉద్యాన పంటలను ప్రోత్సహించాలని కోరారు. ప్రభుత్వం తీగజాతి కూరగాయల పెంపకానికి సబ్సిడీ ఇస్తుందని, రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచ్‌లు నాగమల్లీశ్వరి, కాకర్ల విజయ్‌కుమార్‌ల చేతుల మీదుగా పచ్చి రొట్ట విత్తనాలు, భూసార పరీక్ష కార్డులను రైతులకు అందించారు. కార్యక్రమంలో వారి వెంట ఆయా గ్రామాల రైతులు వీఏఏ చాందిని, ఏంపీఈఓ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి..

కొత్తపట్నం: పంట వేసే ముందు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.కిషోర్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో మంగళవారం రాజీవ్ కళామందిర్‌లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వేసిన ప్రతి పంటలకు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఈ క్రాప్ బుకింగ్ వలన పంటలకు బీమా సౌకర్యంతో పాటు సబ్సిడీ, ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది నరసింహులు, ఏఈవో సీహెచ్ అజయ్‌కుమార్, వీఏఏ టీవీ నాగలక్ష్మి, సురేష్, ప్రేమానందం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది..

నాగులుప్పలపాడు: మండలంలోని చదలవాడ, మద్దిరాలపాడు గ్రామాల్లో వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల అధికారులతో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో పోతినేని వెంకట్రావు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవకు సంబంధించి మొదటి విడత రూ.7 వేలు ఈ నెలలోనే రైతులు ఖాతాలకు జమ చేస్తున్నట్లు తెలిపారు. తుది జాబితాను ఈ నెల 19వ తేదీన అన్ని రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంటాయన్నారు. నల్లబర్లీ వేసిన రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకు రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

చీమకుర్తి రూరల్: పచ్చిరొట్ట పంటల వలన ప్రధాన పంటకు పోషకాలు అందుతాయని మండల వ్యవసాయాధికారి డీవీ భాస్కర్ అన్నారు. మంగళవారం బూదవాడ, పులికొండ సచివాలయాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవోలు, వీఏఏలు పాల్గొన్నారు.

సంతనూతలపాడు: మండలంలోని సంతనూతలపాడు, మంగమూరు సచివాలయాలో ఏవో పావని పంటసాగు పత్రం గురించి వివరించారు. ఏఈవోలు, వీఏఏలు పాల్గొన్నారు.



అల్లూరులో విత్తనశుద్ధిపై అవగాహన కలిగిస్తున్న ఏవో కిషోర్‌బాబు



ఎస్ఎన్‌పాడులో అవగాహన కల్పిస్తున్న ఏవో పావని



చదలవాడలో మాట్లాడుతున్న ఏవో వెంకట్రావు

ఎన్‌సీసీతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

ఒంగోలు టౌన్: ఎన్‌సీసీతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని క్విస్ విద్యాసంస్థల అధిపతి డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. మంగళవారం కళాశాల విద్యార్థులు దల్ సైనిక్ క్యాంప్‌కు ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చీరాలలో జరిగిన క్యాంప్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జులై 12వ తేదీన అనంతరపురంలో జరగబోయే రాష్ట్ర క్యాంప్‌లో పాల్గొంటారని తెలిపారు. వీరితోపాటుగా ఈనెల 8 నుంచి 17 వరకు నిర్వహించిన యాన్యువల్ ట్రైనింగ్‌లో క్విస్ క్యాడెట్లు సత్తా చాటారని తెలిపారు. ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న కె. విజయ్, అభిషేక్ ప్రతిష్టాత్మకమైన దల్ సైనిక్ క్యాంప్‌కు ఎంపికయ్యారని చెప్పారు. ఫైరింగ్‌లో బాలికల విభాగంలో జి.వైష్ణవి మొదటి స్థానంలో నిలవగా జాఫ్రీన్ ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. బాలుర విభాగంలో ఆర్ సురేంద్ర మొదటి స్థానం సాధించగా లక్ష్మీ నారాయణ ద్వితీయ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. టెంట్ పిచింగ్‌లో సీనియర్ డివిజన్‌కు చెందిన క్యాడెట్లు మొదటి బహుమతి సాధించారని, సీనియర్ వింగ్‌కి బాలికల జట్టు మొదటి స్థానంలో నిలిచారని వివరించారు. డ్రిల్‌లో పునిత్ శ్యామ్ అద్భుత ప్రతిభ కనబరిచి రెండో స్థానం సాధించాడని, టగ్ ఆఫ్ వార్‌లో బాలికల, బాలుర విభాగాలు మొదటి బహుమతులు సాధించారని తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్యాడెట్లకు ప్రశంస పత్రాలు అందజేశారు. సంస్థ ఎగ్జిక్యూవ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమనూరి శ్రీగాయత్రి క్యాడెట్లను ప్రత్యేకంగా అభినందించారు. క్విస్ కళాశాలలో చదువులతో పాటుగా ఎన్‌సీసీ, ఎన్ ఎస్ఎస్‌లాంటి వాటిల్లో కూడా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ వైవి హనుమంతరావు, మొదటి సంవత్సరం హెచ్ఓడీ డాక్టర్ శ్రీనివాసరావు, సీఎస్ఈ హెచ్ఓడి బుజ్జిబాబు, ఈసీఈ హెచ్‌వోడీ డాక్టర్ హిమబిందు, ఎన్‌సీసీ హెడ్ వైవీ రమణయ్య, స్టూడెంట్ డీన్ డాక్టర్ వాసు బాబు, ఎన్‌సీసీ ఏఎన్ఓ శ్రీనలియ్ తదితరులు పాల్గొన్నారు.

రొయ్యల రైతులను ఇబ్బంది పెడితే సహించం



తహశీల్దార్ శాంతితో మాట్లాడుతున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

కొత్తపట్నం: రొయ్యల రైతులను ఇబ్బంది పెట్టవద్దని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ శాంతిను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల నుంచి రొయ్యల చెరువులు సాగు చేసుకుంటే వాటిపై టీడీపీ నాయకులు లేనిపోని ఫిర్యాదు చేసి ఇబ్బంది పెడుతున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. బీరంగుంట, గాదెపాలెం, మోటుమాల, రాజుపాలెం గ్రామాల్లో ఒక్కొక్కరు 200 నుంచి 300 ఎకరాల్లో రొయ్యల చెరువులు సాగు చేసుకుంటే మా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వారిని ఒక్క రోజు కూడా మేం ఇబ్బంది పెట్టలేదని గుర్తు చేశారు. ఇంకా రొయ్యల చెరువుల రైతులకు విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను కొత్తవి బిగించి మంచి పేరు తెచ్చుకున్నామని వివరించారు. టీడీపీ ప్రభుత్వంలో సాయం చేయాల్సింది పోయి నాయకులు రైతులను ఇబ్బంది పెట్టడం సిగ్గుచేటున్నారు. మండలంలో 2 వేల ఎకరాలు రొయ్యల చెరువులు సాగు చేసుకుంటే సుమారు 1000 ఎకరాలు అనుమతి లేకుండా సాగు చేసుకుంటున్నారని గుర్తు చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ రొయ్యల చెరువుల సాగుకు మేము ప్రోత్సాహం అందిస్తామని, ఫిర్యాదులు వచ్చినా సాధ్యమైనంత వరకు పరిశీలించి రైతులను ఇబ్బంది పెట్టమని చెప్పారు. కార్యక్రమంలో మాజీ జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్, ఎంపీటీసీ సభ్యుడు ఆళ్ల రవీంద్రారెడ్డి, కె.పల్లెపాలెం సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు, తుళ్లూరి వెంకటనారాయణ, సుబ్రహ్మణ్యం, తాతా శ్రీను, మల్లికార్జున, తాత నాంచార్లు తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా తల్లికి వందనం ఇవ్వాలి



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

చీమకుర్తి: మున్సిపల్ వర్కర్‌లకు షరతులు లేకుండా తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని చీమకుర్తి మున్సిపల్ వర్కర్‌లు మంగళవారం కమిషనర్ రామకృష్ణయ్యకు వినతిపత్రం అందించారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలను సైతం పణంగా పెట్టి ఎంతో మందికి సేవలందించిన పారిశుద్ధ్య కార్మికులు, ఇంజినీరింగ్ సిబ్బందికి తల్లికి వందనం పథకంతో పాటు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికులకు ఇచ్చినట్లుగానే జీఓ నెంబర్ 36 ప్రకారం మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బందికి రూ.21 వేలు, రూ.24,500 వంతున జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. తొలుత మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్రభుత్వం తల్లికి వందనంతో పాటు సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. వారికి మద్దతుగా నిలిచిన సీఐటీయూ నాయకులు పూసపాటి వెంకట్రావుతో పాటు ఏడుకొండలు, పద్మ, స్థానికులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో క్షయవ్యాధి నివారణ సాధ్యం



చీమలమర్రిలో అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ రత్నకుమారి

చీమకుర్తి రూరల్: ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే క్షయవ్యాధి నివారణ సాధ్యమవుతుందని జిల్లా ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ రత్నకుమారి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చీమలమర్రిలో 100 రోజుల జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కళ్లె పరీక్ష, ఎక్స్‌రే ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చన్నారు. వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకుంటూ వ్యాధిని నయం చేయవచ్చన్నారు. క్షయ లక్షణాలు ఎలా ఉంటాయి ? అదేవిధంగా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి ? అనే అంశాలపై ఆమె వివరించారు. కార్యక్రమంలో 43 ఓపీలు వచ్చాయని మెడికల్ స్పెసల్ అధికారి డాక్టర్ అఫ్సర్ బాషా తెలిపారు. కార్యక్రమంలో గీబి ఎస్ టి ఎస్ పరశురామ్, ఏఎన్ఎం మేరి, ఆశా వర్కర్, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో వాసవీ క్లబ్ ముందంజ



ఒంగోలు భాగ్యనగర్‌లోని నోటు పుస్తకాలు పంపిణీ చేసిన క్లబ్ సభ్యులు



చీమకుర్తిలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న మాధవరావు

ఒంగోలు మెట్రో:

వాసవీ క్లబ్స్ అంతర్జాతీయ సేవా సంస్థ ద్వారా సమాజ సేవలు నిరంతరంగా కొనసాగుతున్నాయని వాసవీ క్లబ్ జిల్లా 205 రీజియన్ చైర్మన్ చలువాది సత్యనారాయణ తెలిపారు. మంగళవారం వాసవీ క్లబ్ ఒంగోలు సిటిజన్స్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల పర్యవేక్షణకు స్థానిక భాగ్యనగర్‌లోని ప్రభుత్వ బధిరుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ మార్గదర్శనలో క్షేత్రస్థాయి క్లబ్‌లను బలోపేతం చేస్తూ కొత్త ఆలోచనలు, నూతన ప్రణాళికలతో వినూత్నమైన కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకుసాగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా బధిరుల పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిటిజన్స్ అధ్యక్షుడు భూమా శ్రీనివాసులు, కార్యదర్శి మద్దాలి శివప్రసాద్, కోశాధికారి బియ్యపు సంపత్ కుమార్, రీజియన్ సెక్రటరీ మద్దు అరవింద లక్ష్మి, చీమకుర్తి శివ ప్రసాద్, సీహెచ్ సుబ్రహ్మణ్యం, కవితా రాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ..

చీమకుర్తి: చీమకుర్తిలోని బధిరుల పాఠశాలలోని విద్యార్థులకు అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షులు మద్దాళి మాధవరావు చేతుల మీదుగా మంగళవారం విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు, స్వీట్లు అందించారు. విద్యా ప్రమాణాల అభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని మాధవరావు విజ్ఞప్తి చేశారు. కరస్పాండెంట్ ఆంజనేయులుతో పాటు స్థానిక పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి భగవాన్ వెంకయ్య ఆరాధన వేడుకలు

సంతనూతలపాడు: మండల కేంద్రం సంతనూతలపాడులోని ఆవుల బజార్‌లో వెంకయ్యస్వామి ఆలయ ప్రాంగణంలో రెండు రోజుల పాటు భగవాన్ వెంకయ్యస్వామి 17వ ఆరాధన, అదేవిధంగా బైనబోయినస్వామి వారి 14వ ఆరాధన మహోత్సవాలు ఘనంగా జరగనున్నట్లు సంతనూతలపాడు భగవాన్ వెంకయ్యస్వామి సేవా కేంద్రం శిష్య బృందం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి సాయంత్రం వెంకయ్య, బైనబోయినస్వామిలకు వైభవంగా విద్యుత్ దీపాలంకరణలతో గ్రామోత్సవం జరగనున్నట్లు వారు పేర్కొన్నారు. 19న అభిషేకాలు, నగర సంకీర్తన, అగ్నిగుండం ప్రజ్వలన, అష్టోత్తర పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కట్ట యోగి, హిమాలయ యోగి, పిఠాపురం దత్తపీఠం విశ్వానంద భారతి స్వామి, స్వామివారి శిష్యురాలు గుంటూరుకు చెందిన మాతృశ్రీ దుర్గమ్మలు వస్తున్నట్లు వెల్లడించారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

నగరంలో అర్ధరాత్రి ఘర్షణ



ఘర్షణలో గాయపడిన వ్యక్తి

ఒంగోలు టౌన్: దాబాలో బిల్లు కట్టే విషయం దగ్గర జరిగిన గొడవ నగరంలో అర్ధరాత్రి హల్‌చల్ సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం.. పెళ్లూరుకు చెందిన ఒక వ్యక్తి మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో త్రోవగుంట సమీపంలో వ్యవసాయ మార్కెట్ ఎదురుగా ఉన్న ఓ దాబాకు వెళ్లాడు. భోజనం తిన్న తరువాత బిల్లు కట్టే విషయంలో గొడవ జరిగింది. దీంతో దాబాలో పనిచేసే యువకులు కస్టమర్ మీద చేయి చేసుకున్నట్లు సమాచారం. ఈ విషయం తెలిసిన పెళ్లూరు గ్రామస్తులు దాబా వద్దకు చేరుకొని నిర్వాహకుడిని, సిబ్బందిని చితక బాదారు. సమాచారం తెలుసుకున్న తాలూకా సీఐ విజయ కృష్ణ సిబ్బందితో అక్కడికి చేరుకొన్నారు. ఘర్షణలో గాయపడిన పెళ్లూరు వ్యక్తిని జీజీహెచ్‌కు తరలించారు. అయితే దాబా నిర్వాహకులతో కలిసి సీఐ విజయ కృష్ణ దాడి చేసినట్లు పెళ్లూరు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సీఐ దాడిలో సదరు వ్యక్తి తలకు తీవ్రంగా గాయం అయినట్లు చెబుతున్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో జీజీహెచ్ వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.